# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-10-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రభుత్వం అందించే పౌర సేవలు ప్రజలకు మరింత సులభంగా చేరాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నుంచి 3 రోజుల పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పర్యటించనున్నారు.**

3. **తెలంగాణలో ప్రజలకు పలు సంక్షేమ పథకాలు అందిస్తూ అండగా నిలుస్తున్నామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.**

4. **పొట్టు తీయని రొయ్యల ఎగుమతులపై ఆస్ట్రేలియా విధించిన పరిమితులను తాజాగా తొలగించిందని ఏపీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.**

5. **రాష్ట్రంలో నూతనంగా 7 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.**

==========================

ప్రభుత్వం అందించే పౌర సేవలు ప్రజలకు మరింత సులభంగా చేరాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలు సమర్థంగా ప్రజల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో అధికారులతో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందాలని, దీని కోసం సాంకేతిక సాయాన్ని తీసుకోవాలని సూచించారు. సమర్థంగా పౌర సేవలు అందినప్పుడే ప్రజల్లో సంతృప్తి వ్యక్తం అవుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

-------------------------

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలులోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

(వాయిస్..35)

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నుంచి 3 రోజుల పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ – యుఎఈలో పర్యటించనున్నారు. వచ్చే నెల 14, 15వ తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న పార్టనర్ షిప్ సమ్మిట్‌కు వివిధ సంస్థల ప్రతినిధులను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆహ్వానించనున్నారు. 3 రోజుల పర్యటన కోసం ఈ ఉదయం ఆయన హైదరాబాద్ నుంచి దుబాయ్ వెళ్లనున్నట్లు అధికారులు వెల్లడించారు. అక్కడి పారిశ్రామికవేత్తలతో పాటు, ప్రభుత్వ ప్రతినిధులతోను సమావేశం కానున్నారు. దుబాయ్ లో సిఐఐ రోడ్ షో కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు.

---------------------------

ఇందిరమ్మ రాజ్యంలో పలు సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నామని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా నేలపట్ల, ధర్మతండా గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన నిన్న శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతును రాజును చేసే క్రమంలో రైతులు తీసుకున్న 21 వేల కొట్ల రూపాయల రుణాలను మాఫీ చేసినట్లు వెల్లడించారు. సన్న ఒడ్లకు మద్ధతు ధరతోపాటు, ఒక విడత బోనస్ ఇచ్చామని పేర్కొంటూ...

(వాయిస్..31)

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 24వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

స్వయం సహాయ సంఘాల ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. డ్వాక్రా మహిళల నైపుణ్యాలను గుర్తించడం, స్థానికంగా ఉండే వనరులను సద్వినియోగం చేసుకోవడం, సాంకేతికతను వినియోగించుకోవడం వంటి అంశాలతో మహిళల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలు సెర్ప్, మెప్మాలపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం మహిళా సంఘాలు 20 వేల 739 కోట్ల రూపాయలను పొదుపు చేస్తున్నాయన్నారు. అరకు కాఫీ, చిరు ధాన్యాలతో సంయుక్తంగా అవుట్‌లెట్లను ఏర్పాటు చేసే ఆలోచన చేయాలని అధికారులకు సూచించారు.

---------------------------

గత కొన్నేళ్లుగా తెల్లమచ్చ వైరస్ కారణంగా పొట్టు తీయని రొయ్యల ఎగుమతులపై ఆస్ట్రేలియా విధించిన పరిమితులను తాజాగా తొలగించి ఎగుమతులకు అవకాశం కల్పించిందని ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదిగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. రోయ్యల ఎగుమతులను కొత్త మార్కెట్లకు విస్తరించాల్సిన అవసరముందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను – జీఎస్టీని తగ్గించడంతో ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి జిల్లా వాసులు

హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు అవసరమైన యంత్రాలు, పరికరాలపై జీఎస్టీని తగ్గించడం వల్ల వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జిల్లాలోని తొట్టంబేడుకు చెందిన రైతు శ్యామ్ కుమార్ తెలిపారు. జీఎస్టీ సంస్కరణలపై ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ..

(వాయిస్.. 25)

---------------------------

కిడ్నీ రోగులకు ఉపశమనం కలిగించేందుకు రాష్ట్రంలో నూతనంగా 7 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయనగరం జిల్లా ఎస్.కోట, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, చిత్తూరు జిల్లా పీలేరు ఆస్పత్రుల్లోనూ, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా వెంకటగిరి, బాపట్ల జిల్లా అద్దంకి, నంద్యాల జిల్లా సున్నిపెంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఈ డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి కేంద్రంలో రోజూ మూడు సెషన్లలో 15 మందికి రక్తశుద్ధి చేసేందుకు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.

---------------------------

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి – రిమ్స్ ను అన్ని వసతులతో కూడిన మోడల్ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆసుపత్రిని మంత్రి నిన్న తనిఖీ చేశారు.

---------------------------

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా బలపడింది. ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని అమరా వతి లోని భారత వాతావరణం కేంద్రం పేర్కొంది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ, రేపు మధ్యాహ్నం నాటికి ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు ఆనుకుని ఉన్న నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయు గుండంగా మారే అవకాశం ఉందని వాతావరణం కేంద్రం అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ...

..వాయిస్..20 సెకన్లు

తెలంగాణలో పలు జిల్లాల్లో ఈరోజు తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది. అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

=====================